# సావిత్రీ: పోలీసూ

పేపరు వార్తలు తీక్షణంగా చదువుతూన్న సావిత్రి పరధ్యానంలో పడింది. పేపరు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు నవ్వొస్తుంది. ఇంకొకప్పుడు పుట్టెడు దుఃఖం ముంచుకొస్తుంది. ఎందుకో పైవాళ్ల కష్టనష్టాలకు ఇంత కష్టపడి చదవడం అనిపిస్తుంది. అయ్యో పాపం! ఎన్ని కష్టాలు పడే వాళ్లూ, పడలేక ప్రాణాలు తీసుకున్నవాళ్లూ వున్నారా అనిపిస్తుంది. విస్తుపోయి శూన్యంలో దృష్టి నిలిచి చివరికి సర్వం మరచిపోవడం జరుగుతుంది. సావిత్రికి అదే జరిగింది. తీక్షణంగా పేపసు చదువుతూన్న సావిత్రి బుర్ర అకస్మాత్తుగా మ్రానుపడిపోయింది. దేన్ని చూసి? దేన్ని చదివి? వార్తాపత్రికలో వార్త నొకదాన్ని చూసి. ఆ వార్తను చదివి.

పోలీసు వీరాస్వామిని అరెస్టుచేశారు. ఇదేమిటీ, అందర్నీ అరెస్టుచెయ్యవలసిన పోలీసు అరెస్టుకావడం ఏమిటి?...అయినా వార్త అంతే. పోలీసు వీరాస్వామిని అరెస్టు చేశారు. ఓ పెద్దమనిషి కాంపు వెళ్లగా చూసి రాత్రి వేళ ఇంట్లో చొరబడి ఇంటావిడను బలవంతంచేశాడు పోలీసు వీరాస్వామి. కేసు. అందుకే అరెస్టు.

పోలీసు అరెస్టునుచూసి నవ్విన సావిత్రికళ్లు అమాంతంగా అగాధాలు తవ్వుకుని ఆలోచనలోపడ్డాయి. అవును పోలీసైతేమటుకు? అన్న ఆలోచనలు కమ్ముకుని సావిత్రికి సొమ్మసిల్లినంత పని అయింది. భయం, అన్నం పున్నం ఎరగని కన్నెపడుచు.

గొంతు కోయ్యలేదు అని తృప్తిపడింది. గట్టిశిక్ష వీరాస్వామికి పడాలని ప్రార్థించింది-కనబడని దేవుళ్ళని.

స్తబ్ధుపడి కూర్చున్న సావిత్రి మెదడు సావిత్రికి తెలియకుండానే గత చరిత్రను తవ్విపోసేస్తుంది: అందుకే సావిత్రికి ఆ వార్త ఒక్కసారిగా గుండెకు తగిలింది.

ఈనాడు కుర్చీలో కూర్చొని ప్రశాంతంగా ఎదుటివారి కష్టాలను చదవగలుగుచున్న సావిత్రి ఒకనాడు అమాంతం పతిత అయిపోయేదే. కాని గీత బాగుండబట్టి తన పరిస్థితులు సవ్యంగా ఒక కొలిక్కి తేలాయి.

ఆత్మహత్య నేరం. చచ్చిపోతే గొడవలేదు. కాని ఆ ప్రయత్నం విఫలించి దొరికిపోతే శిక్ష. సావిత్రి ఆత్మహత్యచేసుకుందాం అనుకుంది. కాని ఫలితం విషమించింది. ప్రథమ తప్పిదంగా యెంచి జైలుకు బదులు రెస్క్యూహోంకి పంపించారు కొన్ని మాసాలపాటు వుండడానికి. ఈ అభయ నిలయం ఎండిన తన జీవితాన్ని, చిరిగి చెల్లాచెదరైపోయిన ఆశలను చిగిరింపచేస్తుందనీ, తిరిగి తన జీవితం నిత్యమల్లెలా సౌరభం వెదజల్లుతుందని అనుకుందా? అభయ నిలయం దాటేక ఇంకో ఆత్మహత్యాప్రయత్నం తప్పిం దనుకుంది. ఆ భవిష్యత్ప్రయత్నంలో విజయం కాంచడానికి తగిన సత్తువ యిమ్మని దైవాన్ని ప్రార్థించింది. కాని తను అనుకున్నట్లు జరగలేదు. ఇదివరలో తన జీవితంలో నందనవనం వెల్లివిరుస్తుంటే ఎలా నమ్మకం వమ్మయితే నమ్మలేకుండా పోయిందో, ఇప్పుడూ అలాగే నమ్మలేకుండా వుంది. తన జీవితానికి ఆత్మహత్య తప్పించి వేరు దారి వుంటుందంటే, తన హృదయ

పుష్పం తిరిగి వికసిస్తుందంటే? కాని ఇదివరలో నమ్మకం వమ్మయినట్లు జరగలేదు ఇప్పుడు.

అభయ నిలయానికి వచ్చింది తిన్నగా కోర్టునుంచి. గుండెల్లో, తనియుని బాధ తుపానులా హోరెత్తింది. ఎలాగో కళ్లు మూసుకుని కొన్ని మాసాలు గడిపేద్దాం. తర్వాత ప్రయత్నే ఫలే అనుకొంది. గదిలో తెగని ఆలోచనలతో పడుకునివుంటే అమ్మగారు రమ్మంటున్నారని పిలుపు. బితుకు బితుకుమంటూనే వెళ్ళింది.అమ్మగారి ముఖం అప్యాయత వెద జల్లుతోంది.తిరిగీ తన కథ అంతా చెప్పవలసివస్తుందేమో అని బాధపడిన సావిత్రి, తిరిగీ చెప్పి ఓదార్పు పొందుదాం అను కుంది.

రామ్మా కూర్చో అంటూ కుర్చీ చూపెట్టింది అమ్మ గారు - అభయ నిలయపు నిర్వాహకురాలు. వంచినతల ఎత్త కుండా సావిత్రి కూర్చుంది. సావిత్రి ఆలోచనలు పుస్తకంలో చదివినట్లు గ్రహించింది అమ్మగారు. "నీకొచ్చిన భయం లేదు. నీ కేసు వివరాలు నాకు పూర్తిగా తెలుసు. కాని ఒక్కటి నిజం చెప్తావా సావిత్రీ" పిలుపులోని ఆప్యాయత చల్లదనానికి సావిత్రి కన్నీటి మేఘాలు వర్షింపసాగాయి. తల ఎత్తకుండానే చెప్తాను అడగండి అంది.

"చూడు సావిత్రీ, ఆ కుర్రాడు పోలీసు. వ్యక్తి ధర్మాలు జాగ్రత్తగా నిర్వహింపవలసినవాడు. అయినా నీపట్ల ఇలా ప్రవర్తించాడంటే ఆశ్చర్యంగా లేదూ?" అంటే, దానిలో ఆశ్చర్యం ఏమిటీ అన్నట్లు చూసింది సావిత్రి. మను ష్యులు మొగవాళ్లు ఇంతకంటె ఏం చేస్తారు అనుకున్న సావిత్రి

తలలో తిరిగీ ఆలోచనలు లేచాయి. ఎప్పుడూ రాని ఒక ప్రశ్న ఎదురయింది. అవును. ఎందుకూ అలా ప్రవర్తించాడు?

"అంచేత నా కొకటి తోస్తుంది. అతన్ని కనుక పిలిపించి, గట్టిగా అడుగుతే ఏ సంగతీ తేలిపోదూ? ఏమంటావు?" అనడిగింది అమ్మగారు.

"నా ముఖం చూడనంటూ వెళ్ళిపోయినవాడు పిలిస్తే మటుకు వస్తాడా?" అమాయకంగా అడిగింది సావిత్రి.

అమ్మగారు నవ్వేరు సావిత్రి అమాయకత్వానికి. అందుకే అంత సులభంగా మోసపోయింది అనుకున్నారు.

'వెర్రి సావిత్రీ, అలా మనం అనుకుని ఊరుకుంటే ఎలా తెలుస్తుందీ? ప్రయత్నిద్దాం. పేరూ, ఎక్కడివాడో చెప్పు"

సావిత్రి చెక్కిళ్లు సిగ్గుతో ఎర్రబడ్డాయి. ఇంతచేసిన వాడి పేరు చెప్పడానికి సిగ్గెందుకో? "రాఘవుడు. ఏ స్టేషనో తెలియదు కాని నెంబరు 306," అంది తలెత్తకుండా సావిత్రి. "సరే, నువ్వు వెళ్లు. నే మిగతా సంగతి చూస్తానులే" అంటూ అమ్మగారు పంపించేశారు. గదిలోకి వచ్చిందే కాని సావిత్రి ఎలా వచ్చానా అనుకుంది. అడుగుతీసి అడుగుపెట్టిన జ్ఞాపకం లేదు. అతగాడి పేరు చెప్పిన జ్ఞాపకం లేదు. బుర్రంతా ఒకటే ఆలోచన పిలిపిస్తేమటుకు వస్తాడా అని.

రోజులు గడుస్తున్నకొద్దీ సావిత్రి ఆదుర్దా ఎక్కువయింది. ఈ నిలయం విడిచిన వెనువెంటనే తిరిగి ఆత్మహత్యా ప్రయత్నాలు చేద్దాం అనుకుంది. అదొక్కటే మార్గం అనుకుంది కాని మధ్యలో ఇదేమిటి? ఈ అర్థంలేని ఆశ., అర్థం

గాని ఎదురుచూడ్డం? మనస్సు ఎంత చెడ్డది! దాని కెంత సిగ్గు లేదు! ఒక పక్కనుంచి పరిస్థితులు తల పగులకొడుతూవున్నా రెండో పక్కనుంచి వాటిని సరిదిద్దుదామన్న ప్రయత్నం. వాటిలోనుండే ఆనందాన్ని పిండుకోవలసిన ప్రయత్నం.

పది రోజులు దాటిన ఒక నాడు అమ్మగారు ఆనందంగా సావిత్రిగదిలోకి వచ్చారు. వస్తూనే సావిత్రిచెక్కిళ్లు రాస్తూ, "ఇంత అమాయకురాలివి ఎందుకు ప్రేమించావు సావిత్రీ? అంత ధైర్యం లేకపోతే ఎందుకు ప్రేమించావు?" అంటూ సరదాగా అన్నారు. సావిత్రికి ఒక పక్కనుంచి కొండంత ధైర్యం వచ్చింది. ఇంకోవైపునుంచి పుట్టెడు దుఃఖం ముంచుకువచ్చింది. "ఏం చెయ్యను అమ్మగారు! నా కర్మం ఇలా కాలిపోయింది" అంటూ ఆవిడచేతుల్లోకి వొరిగి పోయింది. "నీ కర్మం కాలిపోవడం ఏమిటి? అలా మాట్లా డకు. రాఘవుడు మంచివాడు కనుక సరిపోయింది." విశాల మైన కళ్లు పూరా విప్పిచూస్తూ, "వచ్చాడా? ఏమన్నాడు అమ్మగారు?' తన ఆత్రానికి తనే సిగ్గుపడింది.

అమ్మగారు చెప్పారు. "కబురుపెట్టాను. వచ్చాడు. అసలు ఏ పేట స్టేషనులోనో కూడా తెలియదుకదా. ఎలా నమ్మేనో! ఊళ్లోవున్న స్టేషన్ల జవాన్ల నెంబర్లన్నీ చూసి మొత్తానికి కనిపెట్టాం. కబురుపెట్టాం, వచ్చాడు. నాలుగు సంగతులూ అడిగితే ఏమన్నాడో తెలుసా!" అమ్మగారు ఆగేరు. ఆత్రంగా సావిత్రి చూసింది.

"అంత పిరికిదండీ. తల్లికి తండ్రికి చెప్తే చంపేస్తా రంది. అలాంటిదానివి ఇలా ఎందుకు చేశావు అని అడిగితే

ఏడ్చింది. పోనీ ఎవరికీ తెలియకుండా పెళ్లాడుదాం అంటే, అమ్మయ్యో అంది. ఇంకేం చెయ్యాను చెప్పండి? ఇంక నీ ముఖం చూడనని వచ్చేశాను" అని రాఘవుడు చెప్తే, నీ పిరికితనానికి నాకు అసహ్యమేసింది సావిత్రీ. "దేనికీ అంత ధైర్యం లేనిదానివి. రాఘవుడు చెప్పినట్టు అలా ఎందుకు చేశావు?" ఇప్పుడే తన తప్పిదాన్ని గుర్తించినట్లు సావిత్రి భోరున ఏడవడం చూసి జాలేసింది అమ్మగారికి. "ఇంక ఏడవకు సావిత్రీ. అన్నీ సవ్యంగానే జరిగాయి. రెండు రోజులలో నీకు నీ ఇల్లు ఏర్పడుతుంది. హాయిగా వుందువు గాని" అంటూ ఓదార్చింది.

రెండు రోజులు పోయాయి. సావిత్రికి, రాఘవులుకూ నిలయంలోనే వివాహం జరిపించారు అమ్మగారూ, రాఘవుడి స్టేషన్ ఇన్‌స్పెక్టరూ, ఇంకా కొందరు పెద్దలూ కలసి. రాఘవుడిముఖం చూడలేకపోయింది సావిత్రి. పోలీసు లైన్లో తన ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు సావిత్రిని.

ఇంటికి వెళ్లాక ఏకాంతంలో సావిత్రిని కౌగిటచేర్చుకుంటూ, "చచ్చిపోడానికి ఎందుకు ప్రయత్నించావు సావిత్రీ? నువ్వు చచ్చిపోతే నేనో?" అన్నాడు రాఘవుడు. 'మరెందుకు అలా చేశావు మహా' అందామనుకున్న సావిత్రికి నోరు రాలేదు. రాఘవుడిఛాతీమీద తల నాన్చుకుంది సమాధానంగా. మళ్ళీ రాఘవుడే అన్నాడు: "పోనీలే ఆ ప్రయత్నం చేయడం మంచిదే అయింది. ఫలించకపోవడం అంతకంటే మంచిదైంది. లేకుంటే ఈ రోజు ఇలా వుండగలిగేవాళ్ళమా

సావిత్రీ. నీ పిరికితనం మూలంగా నువ్వూ నేనూ కూడా దుఃఖపడేవాళ్ళం." అంటూ గట్టిగా కౌగలించుకొన్నాడు.

తిరిగి ఆ రోజునుంచీ సావిత్రి జీవితంలో నందనవనం పెరిగి పెద్దదై విరగబూచింది. ఆనందాలను వెదజల్లింది.

"పేపరు చేతపట్టుకుని కంట తడిపెడుతున్నావేం సావిత్రీ?" అంటూ బూట్లు విప్పుకుంటున్న రాఘువుడు పలకరించేదాకా ఈ ప్రపంచంలోకి రాలేదు సావిత్రి. వచ్చీ రాగానే గభీలున పేపరు మూసి నవ్వుతూ లేచి రాఘవుడి చెంతకు వెళ్ళింది. అతని అలసిన నెన్నుదురు ఆప్యాయంగా రాసింది. బూట్లు విప్పడం ఆపి సావిత్రిని కౌగిట చేర్చుకున్నాడు రాఘవుడు. "త్వరగా అన్నం పెట్టు. మళ్ళీ పోవాలి." అన్నాడు.

వంటింట్లోకి నడుస్తున్న సావిత్రిని చూసి, "ఎంతటి సౌభాగ్యాన్ని నిష్కారణంగా పోగొట్టుకొనేవాణ్ణి" అనుకున్నాడు రాఘవుడు.

వెడుతూ వెడుతూ వెనక్కి తిరిగి చూసిన సావిత్రి అనుకుంది, "ఎంతటి వెర్రిదాన్ని! అనవసరంగా జీవితం నాశనం చేసుకోబోయాను!"

కదలుతున్న సావిత్రి అడుగులో నాట్యం, హృదయంలో సంగీతం ఆడీ పాడాయి.